సాక్షి
అన్నమయ్య జిల్లా
మంగళవారం । 20 । ఆగస్టు । 2024



అసలే రద్దీ.. ఆపై ఆక్రమణ

కడప–రేణిగుంట జాతీయ రహదారి ఆక్రమణలకు గురవుతోంది. నందలూరు బస్టాండు సర్కిల్ పరిధిలో హైవే స్థలాలను ఆక్రమించడంతో రోడ్డు కుదించుకుపోతోంది. - 8లో



త్రేతేశ్వరునికి గిరి ప్రదక్షిణ

ప్రముఖ శైవ పుణ్యక్షేత్రమైన అత్తిరాలలోని శ్రీకామాక్షి సమేత త్రేతేశ్వరస్వామికి శ్రావణ పౌర్ణమి సందర్భంగా చేపట్టిన గిరి ప్రదక్షిణలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్ఠం	గరిష్ఠం
మొదటిరకం	రూ.270	రూ.320
రెండోరకం	రూ.200	రూ.266

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 394 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

రోప్ స్కిప్పింగ్‌లో విద్యార్థినికి గోల్డ్‌మెడల్



పతకం, ప్రశంసా పత్రంతో మౌనిక

కురబలకోట : మదనపల్లె సమీపంలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల బీటెక్ కంప్యూటర్ సైన్స్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని బి. మౌనిక రాష్ట్ర రోప్ స్కిప్పింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచింది. ప్రథమ బహుమతి సాధించడంతో పాటు గోల్డ్ మెడల్ కైవసం చేసుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ యువరాజ్ తెలిపారు. రాష్ట్ర రోప్ స్కిప్పింగ్ అసోషియేషన్ కర్నూలులో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనపరచి జాతీయ స్థాయి పోటీలకు కూడా ఎంపికైనట్లు తెలిపారు. కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ నాదేళ్ల విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదేళ్ల మౌనికను అభినందించారు.

విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి టౌన్ : రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన మార్చ్‌ఫాస్ట్‌లో అన్నమయ్య జిల్లాకు చెందిన స్కౌట్ అండ్ గైడ్స్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. వీరికి సోమవారం జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ అభినందనలు తెలిపారు. ఈనెల 15న ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకలో పాల్గొని ఫాస్ట్ మార్చ్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్కౌట్ విద్యార్థులు క్రమశిక్షణ, దేశభక్తిని పెంపొందించుకొని నేటి తరం విద్యార్థులకు రోల్‌మోడల్‌గా నిలవాలని అన్నారు. ఆకాంక్షించారు జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు వీరిని అభినందించారు. స్కౌట్ మార్చ్ ఫాస్ట్‌లో పాల్గొన్న వారిలో రామసముద్రం మండలం ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థి ఎస్ నిజాముద్దీన్, గాలివీడు మండలం నూలివీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన భవిత, నసీబ్‌లు ఉన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి శివప్రకాష్‌రెడ్డి, అన్నమయ్య జిల్లా స్కౌట్ అండ్ గైడ్స్ సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి, అసిస్టెంట్ స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ లక్ష్మీకర్, స్కౌట్ మాస్టర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

21న జాబ్ మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో ఈనెల21న కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ట్రోవిజన్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో టెక్నీషియన్లు, సీఎన్‌సీ ఆపరేటర్లు, హెచ్‌డీఎఫ్‌సీలో ఎగ్జిక్యూటివ్స్, నవ భారత్ కంపెనీలో సేల్స్ అసోసియేషన్, ముత్తూట్ ఫైనాన్స్‌లో మేనేజ్‌మెంట్ ట్రైనీలు, డిక్సన్ కంపెనీలో మిషన్ ఆపరేటర్స్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ చదివి 18–30 సంవత్సరాల మధ్య వయస్సుగల అభ్యర్థులు ఇందుకు అర్హులన్నారు. ఎంపికైన వారికి హోదాను బట్టి రూ. 7–20 వేల వరకు వేతనం ఉంటుందన్నారు. అర్హత, ఆసక్తిగల అభ్యర్థులు బుధవారం ఉదయం 10 గంటలకు విద్యార్హతలకు సంబంధించిన ధృవపత్రాలు, ఫొటోలతో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని ఆయన సూచించారు.

చెయ్యేరుపై..
ఇక చెయ్యి వేయలేరు

- అక్రమ తరలింపును అడ్డుకున్న గ్రామస్తులు
- తాజాగా పెనగలూరులో 8 టిప్పర్లతోపాటు లారీ సీజ్

సాక్షి రాయచోటి : కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉచిత ఇసుక అంటూ ఊదరగొడుతోంది. కానీ అధికార పార్టీ నేతలు చెయ్యేరును చెరపట్టి ఎక్కడికక్కడ పిండేస్తున్నారు. గతంలో ప్రభుత్వం పలుచోట్ల ఎంపిక చేసిన రీచ్ పాయింట్ల వద్ద చెలరేగుతున్నారు. పగలైతే అధికారుల కంటపడతామని గ్రహించి రాత్రికి రాత్రే ఇసుకను తోడేస్తున్నారు. ఇటీవలి కాలంలో చెయ్యేరు పరివాహక గ్రామాల్లో ట్రాక్టర్లను కొనుగోలు చేసి అధికారాన్ని అడ్డుపెట్టుకుని అక్రమ సంపాదనకు తెర లేపుతున్నారు. టిప్పర్లు, లారీలతో ఇసుక సరిహద్దులు దాటించేందుకు చెయ్యేరులో జేసీబీతో తోడుతుండగా..నారాయణనెల్లూరు గ్రామస్తులు తిరుగుబాటు చేసి అడ్డుకున్నారు. పోలీసులకు పట్టించారు.

ఇసుకకు చెయ్యేరు నది బంగారు గని లాంటిది. నది చుట్టూ 20 గ్రామాల వరకు ఉన్నాయి. ప్రతిసారి గుంతలు పెట్టినా వరద వచ్చిన సమయంలో ఇసుక కావాల్సినంత రావడంతో తోడుకునే వారికి తోడుకున్నంత అనే చందంగా మారింది. ప్రధానంగా రాజంపేట, పెనగలూరు, నందలూరు ప్రాంతాల్లోని మందరం, ఓబిలి, నారాయణ నెల్లూరు, బాలరాజుపల్లె, మందపల్లె, అత్తిరాల, కోమంతరాజుపురం, ఎంఆర్ పురం, నందలూరు బ్రిడ్జి, పులపుత్తూరు ప్రాంతం, సిద్ధవటం పెన్నానది, జ్యోతి, టంగుటూరు తదితర ప్రాంతాల్లో విచ్చలవిడిగా చెయ్యేరు నదిలోని ఇసుకను దోచేస్తున్నారు. ప్రభుత్వం మాత్రం పేదలకు రవాణా ఛార్జీలతోపాటు లోడింగ్ ఛార్జీలు తప్ప ఉచితం అంటున్నా సరైన సమయానికి అందడం లేదు. కానీ చెయ్యేరు చుట్టూ ఎక్కడ చూసినా రాత్రి సమయాల్లో జోరుగా ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. అధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఇసుక టిప్పర్లు

అక్రమార్కులకు అండ

జిల్లాలో యదేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. గతంలో స్టాక్ పాయింట్ల వద్ద నుంచి వందల టన్నుల్లో ఇసుకను తోడేసిన తెలుగు తమ్ముళ్లు అధికారాన్ని అడ్డుపెట్టుకుని ప్రస్తుతం ఎన్‌ఫోర్స్‌మెంట్, పోలీసులకు పట్టుబడుతున్న వాహనాల విషయంలోనూ రాజకీయం చేస్తున్నారు. నదిలో ఇసుక తరలిస్తూ పట్టుబడిన వాహనాలను విడిపించేందుకు అక్రమార్కులకు అధికార పార్టీ నేతలు అండగా నిలుస్తున్నారు. అధికారం వచ్చిన రెండు నెలల్లోనే ఎక్కడపడితే అక్కడ ఇసుక దోపిడీతో దండుకోవాలని చూస్తుండడంపై ప్రజలు తిరగబడుతున్నారు.

గ్రామస్తుల ఆగ్రహం

పెనగలూరు మండలంలోని నారాయణ నెల్లూరు సమీపంలోని చెయ్యేరు నదిలో ఇసుకను రాత్రికి రాత్రే తరలించేందుకు నదిలోకి వెళ్లగా గ్రామస్తులు పనిగట్టుకుని కనిపెట్టి తిరగబడ్డారు. ఆదివారం అర్ధరాత్రి ప్రాంతంలో వచ్చిన లారీలు, టిప్పర్లు, ట్రాక్టర్లను బయటికి వెళ్లకుండా అడ్డుకుని పోలీసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు సమాచారం అందించారు. ఎక్కడా ఇసుక అక్రమంగా పోలేదని ప్రభుత్వం చెబుతున్న తరుణంలో నారాయణ నెల్లూరులో జనాలు రెడ్ హ్యాండెడ్‌గా పట్టించారు. అక్రమార్కులు తరలించుకుపోతున్నా మీరేం చేస్తున్నారంటూ గ్రామస్తులు అక్కడికి వచ్చిన అధికారులను నిలదీశారు. అక్కడ 8 టిప్పర్లతోపాటు ఒక లారీ, పలు ట్రాక్టర్లను పట్టుకుని వాహనాలను సీజ్ చేశారన్న విషయం తెలుసుకున్న అధికారపార్టీ నేతలు నందలూరు మండలంలోని టంగుటూరు, రాజంపేట ప్రాంతంలోని పలుచోట్ల రాత్రిళ్లు తిరిగే టిప్పర్లను రహస్య ప్రాంతాలకు తరలించినట్లు తెలియవచ్చింది. ఏది ఏమైనా ప్రజల్లో చైతన్యం రావడంతో ఇసుకాసురులు సైతం నదిలోకి వెళ్లాలంటే జంకుతున్నారు.



ఇసుక అక్రమ రవాణాను వ్యతిరేకిస్తూ వాహనాలను అడ్డుకుంటున్న నారాయణ నెల్లూరు గ్రామస్తులు

23 నుంచి గ్రామసభలు నిర్వహించాలి

రాయచోటి (జగదాంబసెంటర్) : కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద 2024–25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన పనులు/ప్రాజెక్టుల ఆమోదం కోసం ఈ నెల 23వ తేదీ నుంచి గ్రామసభలు నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే మంజూరు చేసిన, పురోగతిలో ఉన్న పనులను చదివి చెప్పాలని, 2024–25 సంవత్సరం కొత్త పనుల కోసం ప్రతిపాదనలు, సోషల్ ఆడిట్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.

వైభవం..పల్లకీ ఉత్సవం



పల్లకీలో ఊరేగుతున్న శ్రీ భద్రకాళీ సమేతుడు

రాయచోటి టౌన్ : శ్రావణ మాసంలో భాగంగా సోమవారం రాయచోటి శ్రీ భద్రకాళీ సమేతుడికి పల్లకీ సేవ నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణయ్య స్వామి, శంకరయ్య స్వామి, శేఖర్ స్వామి, మల్లిఖార్జున స్వామి, వేదపండితులు రాచరాయ యోగీ స్వామి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు.అనంతరం ఉత్సవమూర్తులను రంగు రంగుల పూలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి పల్లకీపై కొలువుదీర్చారు.ఆలయామాఢవీధుల్లో ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు.పల్లకీ సేవలో ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. రాఖీ పండుగ సందర్భంగా సోమవారం ఆలయానికి వచ్చిన భక్తులకు అర్చకులు కంకణాలు ఉచితంగా అందజేశారు.

మిన్నంటిన జూడాల నిరసన



రిమ్స్ ఆవరణంలో రిలే నిరాహార దీక్షలలో పాల్గొన్న జూడాలు, వైద్య విద్యార్థులు

కడప అర్బన్ : కోల్‌కతాలో ఆర్‌జీకేఆర్ వైద్య కళాశాలలో పీజీ మహిళా డాక్టర్‌పై అత్యాచారం, హత్యకు పాల్పడిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని కడప జూనియర్ డాక్టర్లు డిమాండ్ చేశారు. కడప రిమ్స్ ఆవరణలో జూనియర్ డాక్టర్స్ ఆధ్వర్యంలో సాగుతున్న నిరసన మిన్నంటింది. సోమవారం జూనియర్ డాక్టర్స్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా రిమ్స్ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్. ఖదీర్, ఉపాధ్యక్షులు డాక్టర్ జయభారత్‌రెడ్డి, డాక్టర్ అశ్విని, నాయకులు డాక్టర్ ఏ. నిఖిల్ సింగ్ మాట్లాడారు. ప్రాణాలను పణంగా పెట్టి వైద్య వృత్తిని చిత్తశుద్ధితో నిర్వహిస్తే ఆమెపై అత్యాచారానికి పాల్పడటంతో పాటు, దారుణంగా హత్య చేశారనీ, అలాంటి మృగాలను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. తొలి రోజున రిలే నిరాహార దీక్షల్లో కూర్చున్న జూనియర్ డాక్టర్స్, వైద్య విద్యార్థులలో ఖాదర్‌బాషా, వైష్ణవి, వేణు, పృథ్వీ, దీపిక, రాహుల్ మహారియా, ప్రియాంక యాదవ్, క్రిల్, శశికిరణ్, అఫ్రీన్, పుదుర్ పవన్, పాయల్ రాజ్ వున్నారు. రిమ్స్‌లో జూనియర్ డాక్టర్స్ ఆందోళనకు పరిపాలన విభాగం నాయకులు రవి, మునీంద్ర, ఇతర ఉద్యోగులు తమ సంపూర్ణ మద్దతును తెలియజేశారు. జూనియర్ డాక్టర్స్ ఆందోళనకు సీఐటియు నాయకులు మనోహర్, రిమ్స్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ యూనియన్ సంఘాల నాయకులు తదితరులు మద్దతు తెలియజేశారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్



ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి : ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో స్వీకరించిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని, ఎలాంటి అలసత్వం చూపరాదని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సందర్భంగా జిల్లా కలెక్టర్‌తోపాటు జేసీ ఆదర్శన్ రాజేంద్రన్, డిఆర్‌ఓ సత్యనారాయణరావులు ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమానికి సంబంధించి ప్రభుత్వం నిర్దిష్టమైన మార్గదర్శకాలు ఇచ్చిందన్నారు. అనంతరం అర్జీదారుల నుండి వారు అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మెరుగైన పునరావాసం కల్పిస్తాం

ఓబులవారిపల్లె : మంగంపేట కాపుపల్లి, హరిజనవాడ, అరుంధతివాడ గ్రామాలకు సంబంధించి ఆర్‌ఆర్–5 లేఅవుట్‌లను సోమవారం జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మంగంపేట నిర్వాసితులకు ప్రభుత్వం ద్వారా సహాయ సహకారాలు అందిస్తామని స్పష్టం చేశారు. మంగంపేట కాపుపల్లి హరిజనవాడ, అరుంధతివాడ గ్రామ ప్రజల కోరిక మేరకు లేఅవుట్‌లో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. 570 మంది కుటుంబాలకు ఇంటి పట్టాలు ఇచ్చేందుకు చర్యలు చేపట్టాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. అనంతరం సీపీఓ సుదర్శన్ రెడ్డి మ్యాప్ ద్వారా ఆర్‌ఆర్–5 లేఅవుట్ గురించి జిల్లా కలెక్టర్‌కు వివరించారు. రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోమ్ నదియా దేవి, తహసీల్దార్ పీర్‌మున్నీ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి (జగదాంబసెంటర్) : జవహర్ నవోదయ విద్యాలయంలో 2025–26 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు నవోదయ విద్యాలయ సమితి స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ జిల్లాకు విజ్ఞప్తి లేఖ పంపారన్నారు. ఆసక్తి గల విద్యార్థులు సెప్టెంబర్ 16లోగా http://navodaya.gov.in లో రిజిస్టర్ చేసుకొని ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు సమర్పించాలన్నారు. 2025 జనవరి 18న ఎంపిక పరీక్ష ఉంటుందన్నారు. ఇతర వివరాలకు 8247702733 నంబర్‌లో సంప్రదించాలని కలెక్టర్ ఆ పేర్కొన్నారు.

ఉప ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల పరిశీలన

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు మండలంలోని మైసూరవారిపల్లి పంచాయతీలో ఈనెల 23వ తేదీన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యటించనున్నారు. ఈనేపథ్యంలో జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ సోమవారం ఏర్పాట్లను పరిశీలించారు. జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దుల్లో కోడీ అంటే ఢీ

- భారీగా కమీషన్లు వసూలు చేస్తున్న దళారులు
- నాలుగు జిల్లాల నుంచి తరలివస్తున్న జూదరులు
- పట్టించుకోని అధికారులు

రాయచోటి–పీలేరు నియోజకవర్గాల సరిహద్దు గ్రామాలైన టి.పసలవాండ్లపల్లెలో కోడి పందేలు జోరుగా నిర్వహిస్తున్నారు.ఈ పందేల్లో లక్షలాది రూపాయలు చేతులు మారుతున్నాయి. దళారులు భారీగా కమిషన్లు వసూలు చేస్తూ కోడి పందేలు నిర్వహిస్తున్నారు. అన్నమయ్య, చిత్తూరు, వైఎస్సార్, అనంతపురం జిల్లాల నుంచి పెద్ద ఎత్తున జూదరలు తరలివస్తున్నారు. రెండునెలలుగా ఇక్కడ కోడిపందేలు నిర్వహిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.



గుర్రంకొండ : టిపసలవాండ్లపల్లె పంచాయతీ పూర్వపు కడప– చిత్తూరు జిల్లాల సరిహద్దుల్లోని కొండల్లో విస్తరించింది. రెండు వైపులా దట్టమైన అడవి, కొండల నడుమ 18 గ్రామాలు ఉన్నాయి. ఈ పంచాయతీ నడుమ నగరి, గుట్టకిందపల్లె గ్రామాల సమీపంలోని అటవీ ప్రాంతాల్లో జోరుగా కోడిపందేలు నిర్వహిస్తున్నారు. ఇక్కడికి చేరుకోవాలంటే ఎవరైనా అష్టకష్టాలు పడాల్సిందే. ఇదే అదనుగా భావించిన దళారులు ఇక్కడ కోడిపందేల నిర్వహణకు శ్రీకారం చుట్టారు. అన్నమయ్య జిల్లాతో పాటు వైఎస్సార్, చిత్తూరు, అనంతపురం జిల్లాల నుంచి పెద్ద ఎత్తున జూదరులు ఇక్కడికి వస్తున్నారు. స్థానిక పాలేటమ్మ చెరువు, నగరి పరిసర అటవీప్రాంతంలో పెద్ద ఎత్తున కోడిపందెలు నిర్వహిస్తున్నారు. వందలాది మంది జూదరులు ద్విచక్ర వాహనాల్లో పెద్ద ఎత్తున ఇక్కడికి చేరుకుంటున్నారు. గ్రామాలకు సమీపంలో పొలాలకు వెళ్లే దారులు, అటవీ ప్రాంతమంతా ద్విచక్రవాహనాలతో నిండిపోతోందని రైతులు వాపోతున్నారు. దళారులు దగ్గరుండి పందేలు నిర్వహిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి.

రూ. 50 వేలు కమీషన్లు..లక్షల్లో పందేలు:

ఒకరోజు కోడిపందేలు నిర్వహించే దళారులకు రూ.50 వేలు కమీషన్లు ముడుతున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఒక కోడితో జూదరి పందెంలో పాల్గొనాలంటే ముందుగా దళారులకు రూ. 200 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. ఒక రోజుపాటు నిర్వహించే కోడిపందేలాకు సుమారు 150 కోళ్లు వస్తుంటాయి. ఈలెక్కన రూ.30 వేలు వరకు కమిషన్లు దళారులు వసూలు చేస్తుంటారు. వీటితోపాటు జూదరులకు కావాల్సిన భోజనాలు, ఇతరత్రా సౌకర్యాలు కల్పించినందుకు మరో రూ.20 వేలు వరకు కమీషన్లు ముడుతుంటాయని గ్రామస్తులు అంటున్నారు. ఈలెక్కన దళారులకు రూ. 50 వేలు వరకు కమీషన్లు పందేలు సమయంలో గిట్టుబాటు అవుతున్నాయి. ఇక నాలుగు జిల్లాల నుంచి వచ్చే జూదరులు రూ. లక్షల్లో పందేలు కాస్తుంటారు. ఈపందేల్లో లక్షలాది రుపాయలు చేతులు మారుతుండడం గమనార్హం.

రెండునెలలుగా నిర్వహణ

టి.పసలవాండ్లపల్లె పంచాయతీలో రెండునెలలుగా కోడిపందేలు జోరుగా నిర్వహిస్తున్నారు. వారంలో రెండు నుంచి మూడు రోజుల పాటు కోడిపందేలు నిర్వహిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వీటిని నిర్వహించే తేది, రోజులను ముందుగానే దళారులు నాలుగుజిల్లాల్లో ఉన్న ముఖ్యమైన జూదరలకు సమాచారం అందిస్తుంటారు. వారు మిగిలిన జూదరులకు సమాచారం అందించి అందరు అక్కడి చేరుకొనే విధంగా ప్రణాళికలు రుపొందించుకుంటున్నారు. పగలనక, రాత్రనక జూదరులు పొలాలు, గ్రామాలు, అడవుల్లో సంచరిస్తుండడంతో రైతులు, ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



కోడిపందేలా నిర్వహణపై గట్టి నిఘా ఉంచాం. మండలంలో మరోసారి కోడిపందేలు జరగకుండా చర్యలు చేపడతాం. గ్రామాల్లో కోడిపందేలా నిర్వహణపై ప్రజలు సమాచారం ఇచ్చి పోలీసులకు సహకరించాలి. త్వరలోనే కోడిపందేల నిర్వహించే దళారులపై చర్యలు తీసుకుంటాం.
– మధురామచంద్రుడు, ఎస్‌ఐ, గుర్రంకొండ.

25న అథ్లెటిక్ పోటీలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో 25న ఆదివారం ఉదయం 9.30 గంటలకు జిల్లాస్థాయి అథ్లెటిక్ పోటీలను నిర్వహించనున్నట్లు బాషా అథ్లెటిక్ ఫౌండేషన్ కార్యదర్శి అమ్మర్‌బాష, జిల్లా అథ్లెటిక్ సంఘం అధ్యక్షుడు వీరకళ్యాణ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 14, 16 సంవత్సరాలలోపు బాల బాలికలకు పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనపరచిన క్రీడాకారులను సెప్టెంబరులో 14, 15, 16 తేదీల్లో గుంటూరు ఆచార్య నాగార్జున యనివర్సిటీలో జరగనున్న రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్ ఛాంపియన్ షిప్ పోటీలకు ఎంపిక చేయనున్నారు. మరిన్ని వివరాలకు 9949686586, 8019880995 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

క్లుప్తంగా

రైలు కింద పడి యువకుడి మృతి


మృతి చెందిన రామ్‌ముర్ము

వాల్మీకిపురం : రైలు కింద పడి కంకర మిషన్ దినకూలి మృతి చెందిన సంఘటన సోమవారం మండలంలోని చింతపర్తి పంచాయతీలో చోటు చేసుకొంది. రైల్వే పోలీసుల కథనం మేరకు.. జార్ఖండ్ రాష్ట్రం సారక్‌గట్టుకు చెందిన లక్ష్మి ముర్ము కుమారుడు రామ్‌ముర్ము (30) మండలంలోని మద్దెలచెరువుపల్లి కంకర్ మిషన్‌లో పని చేస్తున్నాడు. సోమవారం తెల్లవారుజామున కాలకృత్యాలు తీర్చుకునేందుకు చింతపర్తి సమీపంలోని రైల్వేగేటు దాటుకుని చెరువు వద్దకు వెళ్లి వస్తుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొంది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మూతపడిన హెల్త్ క్లినిక్


మూసివేసిన హెల్త్ క్లినిక్ వద్ద ఎదురు చూస్తున్న మహిళ

వీరబల్లి : మండలంలోని సానిపాయి పంచాయతీ, కొత్తపేటలో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్ సోమవారం మూతపడింది. దీంతో రోగులు వెనుదిరిగి వెళ్లిపోయారు. అక్కడ పనిచేస్తున్న సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించకపోవడంతో ఇలా మూతపడుతోందని గ్రామస్తులు తెలిపారు. సోమవారం ఆ గ్రామానికి చెందిన బుట్టిమణి నాగరత్నమ్మ అనే మహిళ జ్వరంతో బాధపడుతున్న తన బిడ్డలను తీసుకొని విలేజ్ క్లినిక్‌కు వైద్యం కోసం వెళ్లింది. క్లినిక్‌ను మూసివేయడంతో ఆమె తీవ్ర ఇబ్బంది పడింది. ఈ విషయంపై మండలంలో పనిచేస్తున్న వైద్యాధికారిని వివరణ కోరగా సిబ్బంది గ్రామాలలో వైద్యం కోసం వెళ్లారని వెంటనే హెల్త్ క్లినిక్‌కు పంపిస్తామని సమాధానం ఇచ్చారు.

అసలే రద్దీ.. ఆపై ఆక్రమణ

- ఆక్రమణలో జాతీయ రహదారి
- కుదించుకు పోతున్న నందలూరు బస్టాండు
- సింగిల్‌రోడ్‌గా మారుతున్న వైనం
- తరచూ ప్రమాదాలు..ట్రాఫిక్‌తో ఇబ్బందులు
- పట్టించుకోని ఎన్‌హెచ్‌ఐఏ అధికారులు


కడప-రేణిగుంట జాతీయరహదారిలోని నందలూరు బస్టాండు (రాజంపేటవైపు) ఆక్రమణలతో ఇరుకుగా మారిన దుస్థితి

రాజంపేట : కడప-రేణిగుంట జాతీయ రహదారి ఆక్రమణలకు గురవుతోంది. నందలూరు బస్టాండు సర్కిల్ పరిధిలో లక్షలు విలువ చేసే హైవే స్థలాల(రోడ్డుపక్కన)ను ఆక్రమించడంతో రోడ్డు రానురాను కుదించుకుపోతోంది. అసలే రద్దీగా ఉండే బస్టాండు దీనికితోడు ఆక్రమణల పర్వం మరింతగా జనాలను ఇబ్బందులకు గురిచేస్తోంది. నిత్యం ట్రాఫిక్‌తో హైవేలో వాహనాలు బారులు తీరుతున్నాయి. వీటి గురించి అడిగే నాథుడు కరువయ్యాడనే విమర్శలు వినిపిస్తున్నాయి. నూతనంగా రైల్వేట్రాక్ ఆవలివైపు కడప-రేణిగుంట జాతీయ రహదారి నిర్మాణానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. అప్పటి వరకు వాహనదారులు ప్రస్తుతం ఉన్న రహదారినే వినియోగించుకోవాల్సి వస్తోంది.

పట్టించుకోని ఎన్‌హెచ్ అధికారులు

ప్రస్తుతం ఈ రహదారి నేషనల్ హైవే ఆఫ్ అథారిటీ పర్యవేక్షణలో ఉంది. ఈ రోడ్డు ఆక్రమణల గురించి ఆ శాఖ అధికారులు అసలు పట్టించుకోవడంలేదు. కనీసం ఫిర్యాదు చేద్దామన్నా వారు అందుబాటులో లేకపోవడం దారుణమని పలువురు వాపోతున్నారు. మూడు నెలల క్రితం ఇటీవల ఎన్‌హెచ్ నుంచి ఎన్‌హెచ్‌ఏఐ ఆధీనంలోకి కడప-రేణిగుంట రహదారి వెళ్లింది.

సింగిల్ రోడ్డుగా మారుతున్న దుస్థితి..

ఇప్పుడు డబుల్ రోడ్డుగా ఉన్న రోడ్డు కాస్తా సింగిల్ రోడ్డుగా రోజురోజుకు కుదించుకుపోతోంది. కొందరు అధికారపార్టీ నేతల అండతో తమ దుకాణాలను ముందుకు తీసుకొచ్చి ఏకంగా నిర్మాణాలు చేపట్టారు. రెండు దశాబ్దాల క్రితం రోడ్డు నిర్మాణంలో భాగంగా ఆర్‌అండ్‌బీ శాఖ సర్వే చేసి మార్కింగ్ వేసింది. ఆ ప్రకారం నిర్మాణాలను తొలగించిన సంగతి తెలిసిందే. అయితే మళ్లీ మార్కింగ్ కనిపించకుండా చేసి యథేచ్ఛగా నిర్మాణాలు ముందుకొచ్చేశాయి.

ఆక్రమణలతో ఇరుకైన నందలూరు బస్టాండు సర్కిల్

ఎన్‌హెచ్‌ఐఏకు సంబంధించి రోడ్డు ఆక్రమణలతో ఇరుకుగా మారిపోయింది. తరచూ వాహనాల రాకపోకలు కష్టమవుతున్నాయి. ఓ వైపు ఆటోలు, మరో వైపు లారీ, బస్సులు రాకపోకలతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. బస్టాండు సర్కిల్ రాజంపేట వైపు అయితే ఇక చెప్పనక్కర్లేదు. ఓ స్వీటు దుకాణం ఏకంగా రోడ్డులోకి నిర్మాణం చేపట్టి ముందుకొచ్చారని ఆరోపణలు ఉన్నాయి. అక్కడే ఆటోలు నిలబెట్టడం, దీంతో రోడ్డు ఇరుకుగా మారిపోయి. వాహనాల రాకపోకలు స్తంభించిపోతున్నాయి. అలాగే ఈ రహదారిలో చాలా దుకాణాల వారు రోడ్డును ఆక్రమించేశారు. ఇక్కడే అనేక ప్రమాదాలు జరిగాయి. అటు సౌమ్యనాథాలయం ఆర్చ్, కడప వైపు కూడా ఇదే పరిస్థితి. ఈ నేపథ్యంలో నందలూరు బస్టాండులో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చేసేందుకు వీలులేని పరిస్థితులు నెలకొన్నాయి.

నందలూరు బస్టాండు స్వరూపమే మారిపోయింది



జాతీయ రహదారిలోని నందలూరు బస్టాండు సర్కిల్ స్వరూపమే మారిపోయింది. రోడ్డు విశాలంగా లేదు. ఫలితంగా ప్రమాదాలు నెలకొంటున్నాయి. నిత్యం రద్దీగా ఉండే బస్టాండులో ట్రాఫిక్ సమస్య జటిలమైంది. ఈ సమస్య పరిష్కారంపై ఎన్‌హెచ్ అధికారులు, పోలీసులు దృష్టి సారించాలి. రోడ్డు నిర్మాణంలో తొలిగా ఎలా ఉందో అలాగే ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఎన్‌హెచ్ అధికారులపై ఉంది.

-పెనుబాల నాగసుబ్బయ్య, అంబేద్కర్ సేవాసమితి, నందలూరు

నందలూరు బస్టాండు బాగుపడేదెప్పుడో?



నందలూరు బస్టాండు బాగుపడేది ఎప్పుడో అర్థం కావడంలేదు. ట్రాఫిక్ సమస్య వాహనదారులను పట్టి పీడిస్తోంది. అడగడుగునా వాహనాలు బారులు తీరుతున్నాయి. బస్టాండు సర్కిల్ దాటుకోవాలంటే ప్రమాదకరంగా మారింది. రాజంపేట వైపు మరీ దారుణంగా ఉంది. బస్ ఎక్కాలంటే కూడా భయంగా ఉంది. ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు ఎక్కడున్నారో తెలియదు.

-నారపుశెట్టి వేణు, అరవపల్లె, నాగిరెడ్డిపల్లె అర్బన్

మహిళ ఆచూకీ లభ్యం


భార్యను భర్తకు అప్పగిస్తున్న ఎస్‌ఐ

రామాపురం : మండల కేంద్రమైన పాత రామాపురానికి చెందిన కొరివి జయశ్రీ(20) ఆచూకీ లభ్యమైందని పోలీసులు తెలిపారు. ఆమె ఇంటి నుంచి వెళ్లిపోవడంతో భర్త గంగాధర ఈ నెల 15వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆమె ఫోన్‌కాల్ డేటా ఆధారంగా సుండుపల్లె మండలం సానిపాయిలో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే సిబ్బందితో వెళ్లి ఆమెను రామాపురం పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చినట్లు ఎస్‌ఐ వెంకట సుధాకర్‌రెడ్డి తెలిపారు. అనంతరం ఆమెను భర్త గంగాధరకు అప్పగించారు.

కరెంట్ షాక్‌తో వ్యక్తికి గాయాలు

మదనపల్లె : కరెంట్ షాక్‌తో వ్యక్తి గాయపడిన సంఘటన సోమవారం ములకలచెరువు మండలంలో జరిగింది. చౌడసముద్రానికి చెందిన భాస్కర్ కుమారుడు శేషాద్రి(22) బాత్‌రూమ్ వెళ్లి వచ్చేటప్పుడు తేమ చేతులతో ఫ్యాన్ స్విచ్ వేస్తూ కరెంట్ షాక్‌కు గురయ్యాడు. ప్రమాదంలో గాయపడగా, కుటుంబ సభ్యులు వెంటనే మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం కోలుకుంటున్నాడు.

వేర్వేరు ప్రమాదాల్లో ఆరుగురికి గాయాలు

మదనపల్లె : వేర్వేరు ప్రమాదాల్లో ఆరుగురు వ్యక్తులు గాయపడి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పట్టణంలోని రామారావుకాలనీకి చెందిన బి.రాజునాయక్(22), చంద్రాకాలనీకి చెందిన ఆంజనేయులు(35) కలిసి ఆదివారం రాత్రి ద్విచక్రవాహనంలో రామారావుకాలనీ రింగ్‌రోడ్డులో వస్తుండగా, అక్షయ హోటల్ వద్ద మరో ద్విచక్రవాహనం వీరిని ఢీకొంది. ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. కురబలకోట మండలం అంగళ్లుకు చెందిన జయరాం(60) తనకు బంధువైన రెడ్డిశేఖర్(40)తో కలిసి ద్విచక్రవాహనంలో కనసానివారిపల్లెకు వస్తుండగా, మరో ద్విచక్రవాహనం వీరిని ఢీకొంది. ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు.

రామారావుకాలనీకి చెందిన నాగరాజు కుమారుడు పవన్‌కుమార్(6) స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రెండోతరగతి చదువుతున్నాడు. పాఠశాలకు వెళ్లేందుకు రోడ్డు పక్కన నడిచి వెళుతుండగా ద్విచక్రవాహనం ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. చిప్పిలికి చెందిన రమేష్ భార్య నాగమణి(38) పట్టణంలోని ఎస్టేట్‌లో ఓ కంపెనీలో పనిచేస్తోంది. సోమవారం ఉదయం విధులకు వెళ్లేందుకు ద్విచక్రవాహనంలో వెళుతుండగా, అనిబిసెంట్ సర్కిల్ వద్ద ఆటో ఢీకొంది. ప్రమాదంలో ఆమె తీవ్రంగా గాయపడింది. ఆయా ఘటనల్లో గమనించిన స్థానికులు బాధితులను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

వైభవంగా ఒంటిమిట్ట రామయ్య పౌర్ణమి కల్యాణం


మాంగల్యాన్ని భక్తులకు చూపుతున్న అర్చకులు

ఒంటిమిట్ట : ఆంధ్రా భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి దేవాలయంలో సోమవారం పౌర్ణమి సందర్భంగా సీతారాములకు వైభవంగా కల్యాణం నిర్వహించారు. కల్యాణ వేదికపై సీతారాముల ఉత్సవ మూర్తులను ఆలయ అర్చకులు ఆశీనులు చేసి, ప్రత్యేక అలంకరణ కావించి కల్యాణ తంతును అంగరంగ వైభవంగా చేపట్టారు. ఈ అద్భుత ఘట్టాన్ని వీక్షించేందుకు అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

ఘనంగా కోదండరాముని గిరి ప్రదక్షిణ

ఒంటిమిట్ట కోదండరామస్వామి దేవాలయం నుంచి సోమవారం పౌర్ణమి సందర్భంగా రామ భక్తులు గిరి ప్రదక్షిణ నిర్వహించారు. రామభక్తులు రామనామ స్మరణ చేస్తూ చెంచుగారిపల్లి, పెద్దకొత్తపల్లి, చిన్నకొత్తపల్లి, గంగపేరూరు, ఇబ్రహీమ్ పేట, రాచపల్లి, సీతాపురం, సాలాబాదు, మలకాటిపల్లి మీదుగా తిరిగి ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయానికి చేరుకుని గిరి ప్రదక్షిణను పూర్తి చేశారు.

త్రేతేశ్వరునికి గిరి ప్రదక్షిణ


అత్తిరాలలో త్రేతేశ్వరునికి గిరి ప్రదక్షిణ చేస్తున్న భక్త బృందం

రాజంపేట రూరల్ : ప్రముఖ శైవ పుణ్యక్షేత్రమైన అత్తిరాలలోని శ్రీకామాక్షి సమేత త్రేతేశ్వర స్వామికి శ్రావణ పౌర్ణమి సందర్భంగా చేపట్టిన గిరి ప్రదక్షిణలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. త్తిరాలలో సోమవారం రాత్రి గిరిప్రదక్షిణ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అత్యంత భక్తి శ్రద్ధలతో జరిగింది. తొలుత బహుదానదికి హారతి సమయంలో పట్టణానికి చెందిన రాఘవరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, ప్రభావతి దంపతులు కామాక్షి మాతకు చీరే సారేను అందించారు. కామాక్షిమాతను, త్రేతేశ్వరస్వామిని ప్రత్యేక పల్లకిలో కొలువు దీర్చారు. స్వామి వారి పల్లకిని భక్తులు మోస్తూ, భక్తి గీతాలు ఆలపిస్తూ చేపట్టిన ఈ ప్రదక్షిణ ఆద్యంతం భక్తి పారవశ్యంతో కొనసాగింది. భక్తులకు సోమినేని అంజినాయుడు, కృష్ణవేణీ దంపతులు, కరణం హరిప్రసాద్, రేష్మ దంపతుల సహకారంతో ప్రతినిధులు అన్నప్రసాదం అందజేశారు. భక్తులకు చెర్రీస్ స్కూల్ వ్యవస్థాపకులు రాఘవరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ప్రేమలత దంపతులు తమ స్కూల్ బస్సును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గిరి ప్రదక్షిణ కమిటీ అధ్యక్షుడు సిద్దాలింగారెడ్డి, కార్యదర్శి పోకల ప్రభాకర్, కోశాధికారి వై.నందకిషోర్‌గౌడ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అంగళ్లు మల్లయ్య కొండపై పౌర్ణమి వేడుకలు


అంగళ్లు మల్లయ్యకొండపై భక్తుల సందడి

కురబలకోట : మండలంలోని అంగళ్లు మల్లయ్య కొండపై ఆలయ కమిటీ చైర్మన్ కాకర్ల కృష్ణమూర్తి ఆధ్వర్యంలో పౌర్ణమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక అభిషేకం, పూజలు చేశారు. గోపూజ జరిపారు. తుంగావారిపల్లెకు చెందిన బత్తులప్పగారి తూట్ల రవి కుటుంబీకులు కొండపై భక్తులకు, సందర్శకులకు అన్నదానం చేశారు.

వైభవంగా కుంభాభిషేకం..


పూజా కార్యక్రమంలో భక్తులు

తంబళ్లపల్లె : తంబళ్లపల్లె సమీపంలోని మల్లయ్యకొండపై వెలసిన శ్రీభ్రమరాంబిక మల్లికార్జునస్వామి ఆలయంలో శ్రావణమాసం పురస్కరించుకుని వైభవంగా కుంభాభిషేకం నిర్వహించారు. అర్చకులు కుమారస్వామి, ఈశ్వరప్ప, మల్లికార్జున సంప్రదాయబద్ధంగా హోమం నిర్వహించారు. 101 బిందెల గంగా జలంతో స్వామికి అభిషేకం చేశారు. అనంతరం స్వామికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. తీర్థప్రసాదాలు అందజేశారు. సుదూర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

దొంగ పత్రాలను సృష్టించిన వారిపై చర్యలు తీసుకోవాలి


వెంకటేశ్వరపురంలోని బ్రహ్మంగారి మఠం స్థలాన్ని పరిశీలిస్తున్న కడప ఆర్డీఓ వెంకటపతి

సిద్దవటం : మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీ పరిధి వెంకటేశ్వరపురం గ్రామంలో సర్వే నంబర్ 89/2 లో ఉన్న స్థలానికి దొంగ పత్రాలను సృష్టించిన వారిపై చర్యలు తీసుకోవాలని మాధవరం-1 గ్రామ ప్రజలు కడప ఆర్డీఓ వెంకటపతి దృష్టికి తెచ్చారు. సిద్దవటం మండలంలోని వెంకటేశ్వరపురం గ్రామంలో సర్వే నంబర్ 89/2 లో గత 38 సంవత్సరాల నుంచి శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి గుడి స్థలంలో గ్రామస్తులు బ్రహ్మంగారి ఆరాధన మహోత్సవాలు, అన్నదాన కార్యక్రమాలు, దసరా సందర్భంగా పార్వేట ఉత్సవం నిర్వహించేవారు. అలాగే సమీపంలోని ఎంపీయూపీ స్కూల్ పిల్లలు ఆటస్థలంగా ఉపయోగించునేవారు. అయితే ఈ స్థలాన్ని కొందరు అక్రమార్కులు ఆక్రమించుకునేందుకు దొంగ పత్రాలను సృష్టించి గతంలో ప్రయత్నించగా గ్రామస్తులు అడ్డుపడి జిల్లా కలెక్టర్‌కు, సిద్దవటం తహసీల్దారుకు అర్జీలు సమర్పించారు. దీంతో 2023 జూన్ 7వతేదీ అధికారులు సమగ్ర విచారణ జరిపి ప్రభుత్వ భూమిగా గుర్తించి బోర్డును ఏర్పాటు చేశారు. ఇటీవల తిరిగి బ్రహ్మంగారి మఠం చుట్టూ ఉన్న రాతి ప్రహరీని రాత్రికి రాత్రే తొలగించారని సోమవారం స్థానికుడు జొన్నాదుల వెంకటసుబ్బయ్య స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు. దీనిపై స్థలం పరిశీలించేందుకు వచ్చిన కడప ఆర్డీఓ వెంకటపతి, తహసీల్దార్ మురాషావలి, ఆర్ఐ, వీఆర్‌ఓ, సర్వేయర్‌లు స్థలం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆర్‌డీఓ వెంకటపతి మాట్లాడుతూ సాధ్యమైనంత త్వరగా సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

సమస్యలను సత్వరం పరిష్కరించాలి

ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు


ఫిర్యాదుదారుల సమస్యలను వింటున్న ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

రాయచోటి : చట్టపరిధిలో సమస్యలను సత్వరం పరిష్కరించాలని జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు జిల్లాలోని పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ముఖాముఖి మాట్లాడుతూ ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకొని పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. పరిష్కార వేదికలో 50 మంది ఫిర్యాదులు ఇచ్చారు.

బంగారు నగలు చోరీ


పోలీస్ జాగిలంతో నేర స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

సుండుపల్లె : మండల కేంద్రంలోని పద్మరాజు నగర్ కెనరా బ్యాంక్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు మద్రిపల్లి నాగేంద్ర ఇంట్లో ఎవరూలేని సమయంలో చోరీకి పాల్పడినట్లు సీఐ తులసీరామ్ తెలిపారు. ఇంటిలోని బీరువాను పగులకొట్టి అందులోని రెండు బంగారు గాజులు, నాలుగు ఉంగరాలు దొంగిలించినట్లు గుర్తించామన్నారు. మద్రిపల్లి నాగేంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. వేలిముద్రల నిపుణులు, పోలీస్ జాగిలంతో నేర స్థలాన్ని పరిశీలించినట్లు సీఐ తెలిపారు.

ప్రయాణికుల వాహనం దగ్ధం


షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమవుతున్న వాహనం

సిద్దవటం : సిద్దవటం రేంజ్‌లోని బద్వేల్-సిద్దవటం మార్గ మధ్యంలోని సాబ్‌బావి రస్తా సమీపంలో సోమవారం మధ్యాహ్నం టాటాఏస్ ప్యాసింజర్ వాహనంలో షార్టు సర్క్యూట్‌తో మంటలు చెలరేగి దగ్ధమైందని ఏఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. సిద్దవటం మండలంలోని ఆకురోపల్లె గ్రామానికి చెందిన పులి నాగ ఓబయ్యకు చెందిన టాటా ఏస్ వాహనం సోమవారం బద్వేలు నుంచి 8 మంది ప్రయాణికులతో భాకరాపేటకు బయలుదేరింది. వాహనం సిద్దవటం రేంజ్ సాబ్ బావి రస్తా సమీపంలోకి రాగానే ఇంజిన్‌లో పొగలు రావడంతో నాగ ఓబయ్య వాహనాన్ని ఆపేసి ప్రయాణికులను దించేశారు. అంతలోనే డ్రైవర్ సీట్ కింద నుంచి పొగలు రావడంతో ఆయన సీట్‌ను ఎత్తే సరికే షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి వాహనం అంతా కాలిపోయింది.

పొట్టేళ్ల దాడిలో మహిళకు తీవ్ర గాయాలు


గాయపడిన సిద్దమ్మ

ములకలచెరువు : పొట్టేళ్ల దాడిలో మహిళ గాయపడిన సంఘటన సోమవారం మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే మండలంలోని బురకాయలకోట పంచాయతీ ఎర్రగుడివారిపల్లికి చెందిన వెంకటరమణారెడ్డి భార్య సిద్దమ్మ (55) గొర్రెలు మేపుకుని జీవనం సాగిస్తోంది. ఈ నేపథ్యంలో సోమవారం గొర్రెల మందలోని రెండు పొట్టేళ్లు పోట్లాడుకుంటుండగా ఆమె వెళ్లి అడ్డుకుంది. ఈ సమయంలో పొట్టేళ్లు ఆమెపై దాడి చేయడంతో కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబీకులు గాయపడిన మహిళను మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించారు.

వ్యక్తి ఆత్మహత్య

పుల్లంపేట : పుల్లంపేట మండలం, సాధువారిపల్లి దళితవాడకు చెందిన పంతగాని తిరుపతయ్య కుమారుడు పంతగాని పెంచలయ్య (53) మద్యానికి బానిసై పిడిదుల మందు తాగి మృతి చెందాడు. మృతుని కుమారుడు హరినాథ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పుల్లంపేట ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

స్థలం ఆక్రమణపై తహసీల్దార్‌కు ఫిర్యాదు


తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న శ్యామ్‌రాజ్, లక్ష్మీనరసమ్మ

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ, అరవపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం సమీపంలోని తమ స్థలాలను జంబు రవీంద్రబాబు అనే విశ్రాంత ఉద్యోగి ఆక్రమించాడని స్వర్ణాంధ్ర సంస్థ అధ్యక్షుడు వేపగుంట శ్యామ్‌రాజ్, కుంచెపు లక్ష్మీనరసమ్మలు తహసీల్దార్ అమర్నాథ్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. తమ స్థలాన్ని తమకు ఇప్పించి న్యాయం చేయాలని కోరారు.

వేధిస్తున్న భర్తపై కేసు నమోదు

వేంపల్లె : వేంపల్లె మండలం తాళ్లపల్లి గ్రామానికి చెందిన బందలకుంట దేవి అనే మహిళ ఫిర్యాదు మేరకు ఆమె భర్తపై వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తిరుపాల్ నాయక్ తెలిపారు. వేంపల్లె శ్రీరామ్ నగర్‌కు చెందిన గంగాధర్‌తో దేవి వివాహం జరిగింది. అయితే దేవి పేరుమీద ఉన్న ఇంటిని అమ్మాలని ఆమె భర్త ప్రతిరోజు శారీరకంగా, మానసికంగా వేధిస్తుండేవాడని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. ఈ విషయమై ఆదివారం రాత్రి గొడవ పడినట్లు పోలీసులు తెలిపారు. ఆమె భర్త గంగాధర్ కట్టెతో కొట్టగా దేవి కుడిచేయి వద్ద గాయమైంది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పెద్దమండ్యం పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది కొరత


పెద్దమండ్యం పోలీస్ స్టేషన్

పెద్దమండ్యం : ఉమ్మడి చిత్తూరు జిల్లాలో వెనుకబడిన ప్రాంతంగా పేరున్న పెద్దమండ్యం మండలం, నేడు కొత్తగా ఏర్పాటైన అన్నమయ్య జిల్లా కేంద్రానికి 32 కిలోమీటర్ల దూరంలో ఉంది. గత కొన్ని రోజులుగా స్టేషన్‌లో సిబ్బంది కొరత వేధిస్తోంది. దీంతో స్టేషన్‌కు వచ్చే బాధితులకు ఇబ్బందులు తప్పడం లేదు. స్టేషన్‌లో అధికారికంగా ఒక ఎస్ఐ, ఇద్దరు ఏఎస్ఐలు, ఐదుగురు హెడ్ కానిస్టేబుళ్లు, 21 మంది కానిస్టేబుళ్లు విధుల్లో ఉండాలి. అయితే పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ, ఏఎస్ఐలు లేరు. అలాగే ఐదుగురు హెడ్ కానిస్టేబుళ్లు ఉండగా వీరిలో ముగ్గురు డ్యూయింగ్ డ్యూటీపై ఇతర ప్రాంతాలలో విధులు నిర్వహిస్తున్నారు. 21 మంది కానిస్టేబుళ్లు ఉండాల్సి ఉండగా కేవలం ఏడుగురు మాత్రమే ఉన్నారు. వీరిలో ఒక కానిస్టేబుల్ ఇటీవల సస్పెండ్ కాగా, మరొకరు డిజెక్టర్‌గా ఉన్నారు. మరో కానిస్టేబుల్ విధులకు హాజరు కావడం లేదు. దీంతో స్టేషన్‌లో నలుగురు కానిస్టేబుళ్లు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో ఒకరు తంబళ్లపల్లె కోర్టు విధులకు, మరొక కానిస్టేబుల్ చిత్తూరు కోర్టు విధులకు హాజరవుతున్నారు. దీంతో పోలీస్ స్టేషన్‌లో ఇద్దరు హెడ్‌కానిస్టేబుళ్లు, ఇద్దరు కానిస్టేబుళ్లు మాత్రమే విధుల్లో ఉన్నారు. దీంతో పలు కారణాలతో, సమస్యలతో స్టేషన్‌కు వచ్చే ప్రజలకు సకాలంలో న్యాయం అందించే పరిస్థితి లేకుండా పోయింది. కేసులు నమోదు చేయాల్సి వస్తే స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా ఉన్న హెడ్ కానిస్టేబుళ్లు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పెద్దమండ్యం పోలీస్ స్టేషన్‌కు సిబ్బందిని నియమించాల్సిన అవసరం ఉంది.